# పాఠం 17 స్వతంత్ర భారత రాజ్యాంగ నిర్మాణం

## కీలక భావనలు

- **రాజ్యాంగం:** రాజ్యం యొక్క లక్ష్యాలను, అవి సాధించే ప్రభుత్వ నిర్మాణాన్ని వివరించే నియమ నిబంధనల సంపుటనే రాజ్యాంగం అందురు.
- **రాజ్యాంగ ప్రవేశిక:** రాజ్యాంగ మౌలిక విలువలను, రాజ్యాంగ నిర్మాతల ఆశయాలను తెలియజేయు రాజ్యాంగ ముందుమాటే రాజ్యాంగ ప్రవేశిక లేదా రాజ్యాంగ పీఠిక.
- **రాజ్యాంగ సభ:** రాజ్యాంగాన్ని రూపొందించడానికి ఏర్పాటైన సభను రాజ్యాంగ సభ లేదా రాజ్యాంగ పరిషత్ అందురు. దీని అధ్యక్షులు – డా. బాబు రాజేంద్రప్రసాద్.
- **రాజ్యంగ ముసాయిద సంఘం:** చిత్తు రాజ్యాంగాన్ని రూపొందించటానికి రాజ్యాంగ సభ ఏర్పాటుచేసిన సంఘాన్ని రాజ్యాంగ ముసాయిద సంఘం అందురు. దీని అధ్యక్షులు- డా. బి.ఆర్.అంబేద్కర్.
- **నేపాల్:** రాజ్యాంగ ప్రవేశికలో "లింగం" అన్న పదాన్ని చేర్చిన దేశం.

  పూర్తిస్థాయి రాజ్యాంగం 2015 సెప్టెంబర్ 15 న అమలులోకి వచ్చింది.

  1959 నాటి రాజు మహేంద్ర.
- **జపాన్:** రాజ్యాంగ ప్రవేశికలో "శాంతి" అన్న పదాన్ని చేర్చిన దేశం.
- **కేబినెట్ మిషన్:** రాజ్యాంగ సభ నిర్మాణం ఈ మిషన్ ప్రణాళికను అనుసరించి జరిగింది.
- **భారత రాజ్యాంగ సభ:**

| | |
|---|---|
| మొత్తం సభ్యుల సంఖ్య | – 389 |
| రాష్ట్రాల నుండి | - 292 |
| సంస్థానాల నుండి | - 93 |
| ఢిల్లీ, అజ్మీర్-మేవాడ్, కూర్గ్, బ్రిటిష్ బలుచిస్థాన్ నుండి | - 4 |

- రాజ్యాంగ సభలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన సభ్యుల సంఖ్య -26, మహిళా సభ్యుల సంఖ్య – 9.
- రాజ్యంగ సభ సభ్యులను పరోక్షంగా రాష్ట్ర శాసన సభ సభ్యులు ఎన్నికున్నారు.
- **రాజ్యాంగ ఆమోదం :** నవంబర్ 26, 1949
- **రాజ్యాంగ అమలులోకి రావటం:** జనవరి 26, 1950



www.digitalsocialteacher.in

- **పార్లమెంటరీ విధానం:** నామమాత్ర అధికారాలు దేశాధినేత చేతిలో ఉండి, వాస్తవ అధికారాలు ప్రధానమంత్రి నేతృత్వంలోని మంత్రిమండలి చేతిలో ఉండి, మంత్రి మండలి శాసన నిర్మాణ శాఖకు బాధ్యత వహించే విధానాన్ని "పార్లమెంటరీ విధానం" అందురు.
- **అధ్యక్ష తరహా విధానం:** వాస్తవ అధికారాలు దేశాధినేత చేతిలో ఉండి, కార్యనిర్వహక శాఖ శాసన నిర్మాణ శాఖకు ఎటువంటి బాధ్యత వహించని విధానాన్ని "అధ్యక్ష తరహా విధానం" అందురు.
- **భారత సమాఖ్య వ్యవస్థ లక్షణాలు:** రెండు స్థాయిలలో అనగా కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో ప్రభుత్వాలు.
  అధికార విభజన
  రాజ్యాంగ ఆధిపత్యం
- **భారత ఏకీకృత వ్యవస్థ లక్షణాలు:** ఒకే న్యాయ వ్యవస్థ
  పౌర, నేర అంశాలలోని మౌలిక చట్టాలలో సారూప్యత.
  అఖిల భారత సివిల్ సర్వీస్ లు.
  ఏక పౌరసత్వం.
- **IAS:** Indian Administrative Service
- **IPS:** Indian Police Service
- **పౌరసత్వం:** చట్టం ప్రకారం సార్వభౌమ రాజ్యంలో చట్టబద్ధమైన సభ్యుడిగా లేదా దేశానికి చెందిన వ్యక్తిగా గుర్తించబడిన స్థితి.
- **ఉభయ పద్దు:** రాజ్యంగంలోని ఈ జాబితాలోని అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చట్టాలు చేయవచ్చు. దీనినే ఉమ్మడి జాబితా అని కూడా అందురు.
- **రాజ్యాంగ సవరణ:** రాజ్యాంగంలోని అంశాలను మార్పులు, చేర్పులు చేయటానికి ఉద్దేశించిన ప్రక్రియను రాజ్యాంగ సవరణ అందురు.
- **42 వ రాజ్యాంగ సవరణ:** ఈ సవరణ ద్వారా 1976 లో భారత రాజ్యాంగ పీఠికకు "సామ్యవాద, లౌకిక" అనే పదాలను చేర్చారు.
- **ముసాయిదా రాజ్యాంగం:** డా.బి.ఆర్.అంబేద్కర్ ఆధ్వర్యంలో ముసాయిద సంఘం రూపొందించిన రాజ్యాంగ చిత్తు ప్రతిని ముసాయిదా రాజ్యాంగం అందురు.
- **ఆదేశిక సూత్రాలు:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రాజ్యాంగం ఇచ్చిన సూచనలనే ఆదేశిక సూత్రాలు అందురు.
- **భారత రాజ్యాంగ రచనకు పట్టిన కాలం:** 2 సంవత్సరాల, 11 నెలల, 18 రోజులు.

www.digitalsocialteacher.in

➢ **సార్వత్రిక వయోజన ఓటుహక్కు:** కుల, మత, వర్గ, లింగ వివక్షత లేకుండా 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించటాన్ని "సార్వత్రిక వయోజన ఓటుహక్కు" అందురు. దీనిని రాజ్యాంగంలోని 326 వ ఆర్టికల్ తెలియజేస్తుంది.

## 2 & 4 మార్కుల ప్రశ్నలు

**1. రాజ్యాంగ సభను సార్వత్రికవయోజన ఓటు హక్కుతో ఎన్నుకుని ఉంటే రాజ్యాంగాన్ని రూపొందించడంలో అది ఎలాంటి ప్రభావాన్ని చూపించి ఉండేది?**

i. రాజ్యాంగ సభ సభ్యులను అప్పటికే ఎన్నికైన రాష్ట్రాల శాసనసభ సభ్యులు ఎన్నుకున్నారు. అంటే ఇది పరోక్ష ఎన్నిక. ఆ శాసన సభ సభ్యులు కూడా సార్వత్రిక వయోజన ఓటు హక్కుతో ఎన్నిక కాలేదు. అప్పటికి ప్రజలలో 10% మందికే ఓటు హక్కు ఉంది.

ii. ఒకవేళ రాజ్యాంగ సభను సార్వత్రిక వయోజన ఓటు హక్కుతో ఎన్నుకొని ఉంటే దేశ ప్రజలందరకు ప్రాతినిధ్యం లభించి వుండేది.

**2. భారత రాజ్యాంగంలోని మౌలిక సూత్రాల గురించి చిన్న వ్యాసం రాయండి?**

సుప్రీంకోర్టు కేశవానంద భారతి కేసులో తీర్పును ఇస్తూ దేశ మనుగడ కొన్ని మౌలిక సూత్రాలపై ఆధారపడి ఉంటుందని వాదించింది. ఏవి మౌలిక సూత్రాలన్న విషయంలో న్యాయమూర్తులలో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ఈ క్రింది వాటిపై ఏకాభిప్రాయం కుదిరింది.

i. ప్రభుత్వ నిర్మాణం
ii. సమాఖ్య లక్షణం
iii. ఉన్నతమైన రాజ్యాంగం
iv. సర్వసత్తాక దేశం
v. సంక్షేమ రాజ్యం

**3. దేశంలోని రాజకీయ వ్యవస్థలను రాజ్యాంగం ఎలా నిర్వచించింది. వాటిని ఎలా మార్చింది?**

దేశంలోని రాజకీయ వ్యవస్థలను రాజ్యాంగం ఈ క్రింది విధంగా నిర్వచించింది.

i. పార్లమెంటరీ వ్యవస్థ: దేశాధిపతి అయిన రాష్ట్రపతికి నామమాత్రపు అధికారాలు, పార్లమెంట్‌లో సభ్యులైన ప్రధానమంత్రి, అతని మంత్రి మండలికి నిజమైన అధికారాలు ఉండటం.

ii. ఏకీకృత న్యాయ వ్యవస్థ: దేశ మంతటికి వర్తించే ఏకీకృత న్యాయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. సుప్రీంకోర్టు దేశంలో అత్యున్నత న్యాయ స్థానం. ఒక రాష్ట్రంలో హైకోర్టు అత్యున్నతమైనది.

iii. సమాఖ్య వ్యవస్థ: కేంద్ర స్థాయిలో కేంద్ర ప్రభుత్వాన్ని, రాష్ట్ర స్థాయిలలో రాష్ట్ర ప్రభుత్వాన్ని రాజ్యాంగం ఏర్పాటుచేసింది. కేంద్ర, రాష్ట్రాల మధ్య స్పష్టమైన అధికారాల విభజన ఉంది.

**4. రాజ్యాంగంలో మౌలిక సూత్రాలు ఉంటాయి. అయితే ప్రజలు వ్యవస్థతో తలపడినపుడే సామాజిక మార్పు వస్తుంది. ఈ వ్యాఖ్యతో మీరు ఏకీభవిస్తారా?**

రాజ్యాంగంలో మౌలిక సూత్రాలు ఉంటాయి. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సమాఖ్య వ్యవస్థ, సంక్షేమ రాజ్యం, సర్వ సత్తాక రాజ్యం మొదలైనవి మౌలిక సూత్రాలు అయితే వీటి అమలుకు ప్రజలు పోరాడవలసి వస్తుంది. ఈ వ్యాఖ్యతో నేను ఏకీభవిస్తాను.

కారణాలు:

i. ఆర్థిక న్యాయం అందించడానికి 'సామ్యవాదం' అన్నపదం 1976లో 42వ సవరణ ద్వారా రాజ్యాంగ ప్రవేశికకు చేర్చారు. అలాగే 1978లో 44వ సవరణ ద్వారా 'ఆస్తిహక్కు'ను ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు.

ii. భారత రాజ్యాంగంలోని 17వ ప్రకరణను అనుసరించి అంటరానితనం నేరం. కాని దానిని అమలు చేయడానికి అనేక సంవత్సరాలుగా పోరాటం చేయవలసి వచ్చింది.

iii. బాలల హక్కుల పరిరక్షణ కోసం అనేక పోరాటాలు చేసిన తర్వాతే వారి కోసం విద్యాహక్కు చట్టం, 2009 అమలులోకి వచ్చింది.

iv. ఎన్ని పోరాటాలు చేసినా చట్ట సభల్లో మహిళలకు ఇప్పటికీ రిజర్వేషన్లు కల్పించలేదు.

**5. ఆనాటి రాజకీయ ఘటనలను రాజ్యాంగం ఎలా ప్రతిబింబిస్తుంది? స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించి ఇంతకు ముందు అధ్యాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోండి.**

భారత స్వాతంత్ర్య పోరాట కాలంలో సంభవించిన అనేక రాజకీయ ఘటనలు భారత రాజ్యాంగ నిర్మాణంలో ప్రతిబింబించాయి. ఆనాటి సమాజంలో ఉన్న వ్యవస్థలను తొలగిస్తూ, కొన్నిటినీ సవరిస్తూ రాజ్యాంగంలో అనేక అంశాలు చేరాయి.

i. వంశ పారంపర్యంగా వచ్చే రాచరిక పాలన కాకుండా ప్రజలు ఎన్నుకునే విధంగా రాజ్యాంగ ప్రవేశికలో ప్రజాస్వామ్యము, గణతంత్రం అన్న పదాలు చేర్చారు.

ii. ఇకపై మనదేశం ఏదేశానికి లొంగి ఉండాల్సిన అవసరం లేదని 'సర్వసత్తాక' పదం సూచిస్తుంది.

iii. భారత ప్రజలు అంతవరకు అనుభవించిన అన్యాయాలు, నిర్బంధాలు దూరం చేయడానికి న్యాయం, స్వేచ్ఛ, సమానత్వము, సౌభ్రాతృత్వం అనే ఆదర్శాలు చేరాయి.

iv. ప్రాచీన కాలం నుంచి బ్రిటిష్ వారి కాలం వరకు భారతీయులు అనుభవించిన సామాజిక, సాంస్కృతిక వైరుధ్యాలను తొలగించడానికి 'ప్రాథమిక హక్కులు' చేరాయి.
v. అంతకు ముందు ప్రజలందరికీ ఓటుహక్కు లేదు. కాని రాజ్యాంగం 'సార్వత్రిక వయోజన ఓటు హక్కు' కల్పించింది.
vi. గాంధీజీ సూచించిన అనేక ఆదర్శాలను ' ఆదేశ సూత్రాల' విభాగంలో చేర్చారు. ఉదా: గోహత్యని నిషేధించడం, మద్యపాన నిషేధం, గ్రామ పంచాయితీల ఏర్పాటు మొదలైనవి.

Prepared by:
**Rambabu Sunkari**
SA(SS)
ZPHS, Garudabilli
Vizianagaram Dt

www.digitalsocialteacher.in